# నేత్రం

## పులికంటి కృష్ణారెడ్డి

ఆ రోజు ఆ పట్టణంలో ఏనోట విందామన్నా అదే మాట!

ఒకే మాట అదీ ఒక పట్టణంలో ప్రతి నోటా వినపడడమంటే - ఆశ్చర్యమేకాదు. అది ఒక అసాధారణ విషయం కూడా. అదే ఎదో ఒక పల్లెలో అయితే ఆ దారే వేరు. అక్కడ చీమ చిటుక్కుమంటే ప్రతి మనిషి గుండె కలుక్కుమంటుంది. అయితే నాగరికత ముసుగులు కప్పుకొన్న పట్టణాల్లో అట్లా కాదే? జీవితం సామాజిక గతితో ముడిపడి ఉంటుందన్న స్పృహకు అక్కడ తావు ఉండదే? రేపు విశ్వరూపమెత్తి వాళ్లను భయపెడుతూ ఉంటుందే? దాంతో ఎవరో వెంటపడి తరుముతున్నట్లు...ఎక్కడో కొంపలు మునిగిపోతున్నట్టు కార్లు మోటార్లు వ్యాన్లు సైకిళ్ల మీద పరుగులు, పోటీలు పడుతూ పరుగులు. ఏ మలుపులోనో అనుకోనట్లుగా వేగం అదుపుతప్పుతుంది. లారీ మోటారును గుద్దేస్తుంది. కారు వ్యానూఢీకొంటాయి. ఆ ప్రాంతమంతా కుంకుమ ఆరబోసినట్లు రక్తమయమవుతుంది. పోలీసులు కాపలా కాస్తుంటారు. చచ్చిన శవాలకు. అదే సమంయలో ఆ పట్టణం శివార్లలో ఒక కాలనీలో కలవారి యింట్లో దుండగులు కత్తులు కటార్లు నాటు బాంబులతో దూరి దోపిడీ చేస్తుంటారు. వీలైతే మానభంగం కూడా!

ఇంకొక మైదానంలో వాగ్దానాల రాజకీయ సభ... అసెంబ్లీ హాలు ముందు నల్లబ్యాడ్జీల ప్రదర్శనలు... కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు... కళాక్షేత్రాల్లో అవధానాల విన్యాసాలు సాఫీగా సాగిపోతుంటాయి. ప్రతి రోజు ఇట్లా ఎన్నో ఎన్నెన్నో కార్యక్రమాలు పరిధికి ప్రచారానికి పరిమితమై జరిగిపోతుంటాయి. అయినా జనం తమకే మాత్రం పట్టీపట్టనట్లుగా...జీవన పోరాటంలో మట్టిలో పురుగులు కూరుకొనిపోతున్నట్లుగా...



అయితే ఆ రోజు మాత్రం ఎ నోట విందామన్నా అదే మాట!

అదేదో కొండకు రెక్కలు వచ్చి ఎగిరిన అద్భుతం కాదు. మట్టిలో కలసిపోయే బూడిద కోసరం మనుషుల సిగపట్లు కాదు. కేవలం ఒక పెండ్లి కార్యం కలిగిన వాడు ఒక ఇంటి వాడయ్యాడు! అంతే, ఆ మాట ఆ ఒక్క రోజే కాదు. వరసగా వారం రోజులు ప్రతి నోటా వినిపించింది.

అతడు ఆహ్వానాలు అచ్చువేయలేదు. కాలికి బలపం కట్టుకొని ఇంటింటికీ తిరిగి బొట్టూ కాటుక పెట్టి పిలవలేదు. అయితే అన్ని పత్రికలలో ప్రకటనలు మాత్రం యిచ్చాడు. 'తన వివాహానికి విచ్చేసిన ప్రతి స్త్రీకి ఒక చీర రవిక..... ప్రతి పురుషుడికి ఒక పంచె చొక్కా!" అని ఇంకేముంది. హితులు సన్నిహితులకంటే ఆ ప్రకటనతో స్పందించిన వాళ్లేయినుమిక్కులు. దాదాపు ఆ పట్టణమే కదిలినట్లయింది.

పెండ్లి పందిరిలో ఇసుక వేస్తే రాలనంత జనం!

అంత మందికి ఎలోటూ రాకుండా అద్భుతమైన ఏర్పాట్లు!!

కండ్లారా చూస్తున్నది. తనివిదీర అనుభవిస్తున్నది. వివరించాలన్నతాపత్రయంతో ఒకడు 'ఆహాహా!' అంటాడు. ఇంకొకడు 'ఒహో హో!' అంటాడు. వీళ్లిద్దరినీ కాదని ఇంకొకడు 'అబ్బబ్బబ్బ!' అంటాడు.

సామాన్యుల పరిస్థితి ఇట్లా ఉంటే కొంతభావుకుడైన వ్యక్తి 'ఆకాశమంత పందిరి కింద... భూదేవంత అరుగు మీద అని నోరు విప్పుతాడు. వాడి నోరు మూయిస్తూ మరొక సహృదయుడు 'వేడుకకు వెల ఎక్కడుందయ్యా? డబ్బు అది ఉండాలి. ఉన్నవాడు అనుకోవాలి. సందర్భం కలసి రావాలి. భువిని దివి చెయ్యడం వాడికొక లెక్కా? ఇక్కడ అసలు విషయం అదికాదే? - అతని సహృదయత, త్యాగం. ఉన్న వాళ్ళందరూ ఇట్లా త్యాగం చెయ్యగలరా? ఆ త్యాగాన్ని గుర్తించాలి" అని అందుకొంటన్నాడు.

వేద. పండితులు శాస్త్రోక్తంగా...గంభీరంగా పలుకుతున్న మంత్రాలు వీనుల విందు చేస్తున్నాయి. మంగళ మేళంలో సన్నాయి నొక్కులు సంగీత ప్రియులను అక్కున చేర్చుకుంటున్నాయి. పట్టు చీరల గరగరలు....పెట్టుకొన్న ఆభరణాల నిగనిగలు మల్లెపూల సువాసనలు ఆ పందిరి కింద వయ్యారాలు పోతున్నాయి. అడుగుకొక్క కలర్ టీవీ జరుగుతున్న శుభకార్యాన్ని మరింత శోభాయమానంగా ప్రదర్శిస్తూ ఉంది.

పురోహితుడు ఆదేశించినట్లుగా అతడు లేచి నిలబడ్డాడు. ఖరీదైన సూట్‌లో అతని మొగంలో కొట్టొచ్చినట్లు పెండ్లి కళ. ఆమెను కూడా పైకి లేపి నిలబెట్టారు కొందరు ముత్తయిదువులు. ఇద్దరి మధ్య పట్టుపంచె తెర. అతడు పురోహితుడు చేతిలో మంగళ సూత్రాన్ని అందుకొన్నాడు. బొటనవ్రేలు తొక్కి ఆమె మెడలో బొట్టు కట్టాడు!

ఆకాశం నుండి నక్షత్రాలే నేల రాలినట్లుగా అక్షింతల వర్షం!

క్రమంగా అక్షింతల వర్షం ఆగింది.

అతడు వేదిక మీద అమర్చినే మైక్ ముందు నిలబడ్డాడు. గొంతు సవరించుకొన్నాడు. అందరి ముఖాల్లో ఆశ్చర్యం. ఎమి చెప్తాడో అన్న ఆతురత. నిశ్శబ్దం ఆవరించింది.

"హితురాలా! స్నేహితురాలా! నా ఆహ్వానాన్ని మన్నించి నన్ను ఆశీర్వదించడానికి విచ్చేసిన తమకందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్తున్నాను" అంటూ రెండు చేతులెత్తి నమస్కరించాడు.

పెండ్లి పందిరిలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి!

ఆ ఆనందంలో మనస్సు ఆ పందిరి వైశాల్యాన్ని కొలుస్తున్నట్లుగా నాలుగు వైపులా తిరుగుతూ ఉంది. అతడు మరలా గొంతు సవరించుకొన్నాడు. సద్దు మణిగింది.

"ఈ రోజు నేను పెడుతున్న ఈ ఖర్చు నా ఆనందాని కొలమానమైనా చాలామంది దృష్టికి దుబారాగా తోచవచ్చు. ఈ ఆడంబరాలు అట్టహాసాలు శుద్ధ దండగ అని కూడా అనిపించవచ్చు. నేను అంగీకరిస్తాను. ఈ పట్టణంలో కాకంటే ఎందరో ధనికులున్నారు. అదీ అంగీకరిస్తాను. అయితే డబ్బు ఏ ఒక్కడి ఇనప్పెట్టెలోనో మూలగడం నేను అంగీకరించలేను. అది చేతులు మారాలి. చలామణీ కావడమే దాని లక్షణం!

సభలో చప్పట్ల మోత!

"మనిషిలో ఆశయం ఉన్నతంగా ఉండాలి. ఆలోచన వాస్తవానికి దగ్గరగా ఉండాలి. ఎవరైతే తమ ధర్మాన్నిసక్రమంగా నిర్వర్తించలేరో వాళ్లు ఇతర విషయాలకు సులభంగా బానిసలైపోతారు. అటువంటి వ్యక్తులు తలుపు తట్టి వచ్చిన అదృష్టాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేదు.

అదృష్టం నన్ను వెదుక్కొంటూ వచ్చింది. రెండు చేతులెత్తి ఆహ్వానించాను. ఆ తర్వాత ఎత్తిన చేతులను దించలేదు. ఎదురైన ప్రతి అనుభవాన్ని ఒక యుద్ధంలా స్వీకరించి పోరాడాను. అప్పుడు నేను పట్టిందంతా బంగారమయింది. అయితే నేను సంపాదించిన డబ్బు.... కట్టించిన మిద్దెలు మేడలూ... స్థాపించిన పరిశ్రమలూ-ఇవన్నీ ఏవీ శాశ్వతం కాదని గ్రహించాను. వెంట ఎదీ రాదని కూడా తెలుసు. కడపటికి మనిషి మంచితనం విశ్వాసం వం

టివే ప్రమాణంగా నిలుస్తాయని తెలుసుకొన్నాను. ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాను"

పెండ్లి పందిరిలో చప్పట్ల వర్షమే కురిసింది.

"మనిషిలో మంచితనానికి విశ్వాసానికి గీటురాయి త్యాగం. విశ్లేషణకు అందని ఒక గొప్ప గుణం. ఈ రోజు నేను చేసింది త్యాగం అవునోకాదో మరి? ఇప్పుడు నేను మెడలో తాళిగట్టిన వ్యక్తి ఈ క్షణం నుండి నా సహధర్మచారిణి. భగవంతుడు ఆమెకు తీరని ద్రోహం చేశాడు. ఇంత అందాన్ని ఇచ్చినవాడు చూపును ఇవ్వలేకపోయాడు. అయినా ఆమె ఇంతమంది ఆత్మీయతను...దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఈ అలంకారాలను తన మనోనేత్రంతో చూడగలుగుతున్నది. ఆమె పెదవులపై విరబూస్తున్న చిరునవ్వులే దీనికి సాక్షి! - బహుశా ఈమె కోసమేనేమో నేను ఇంతకాలం అవివాహితుడుగా మిగిలిపోయాను"

అతని అనురాగ రాగ స్పర్శతో ఆమె గుండె పులకరించింది. బుగ్గలు సిగ్గుతో నిగ్గు తేలాయి. తలవాలిపోయింది.

పెండ్లి పందిరిలో చూపులన్నీ అతని మీదే!

"ఈ రోజు నుండి నా ఇంట్లో పనిచేస్తున్న నౌకర్లందరినీ పనిలో నుండి తొలగిస్తున్నాను. అయితే అందరికీ జీవనభృతి కల్పిస్తున్నాను. వాళ్ళ స్థానంలో సంఘంలో చిన్న చూపుకు లోనయి తమకు తాముగా బ్రతకలేని మూగ వాళ్లను చెవిటి వాళ్లను నా ఇంటి నౌకర్లుగా నియమించుకొంటున్నాను."

హర్షధ్వానాలతో ఆ పెండ్లి పందిరి మారుమ్రోగింది.

మంగళసూత్ర ధారణ అయిన తరువాత శాస్త్రోక్తంగా జరగవలసిన కార్యక్రమాలను పురోహితుడు ఆరంభించాడు. ఆ తంతు యథాలాపంగా జరిగిపోతూ ఉంది.

ఒక ప్రక్క బోజనాలు.... మరొక ప్రక్క వస్త్ర దానాలు ......హితులు...సన్నిహితుల అభినందనలు - ఎక్కడో లేదు స్వర్గం ఆ పందిరి క్రిందనే ఉందనిపిస్తూ ఉంది.

"ఓ హోహో! ఎన్నివేల మంది భోజనం చేశారు. ఎంత మందికి వస్త్రదానం జరిగింది? ఇదంతా ఒక ఎత్తయితే అంత సంపన్నుడు ఎంత అందగత్తె అయితే మాత్రం ఒక గుడ్డివాని మెడలో తాళిగట్టడమా? ఇంట్లో మూగవాళ్లను చెవిటివాళ్లను నౌకర్లుగా పెట్టుకోవడమా? త్యాగమంటే అదే త్యాయం!"

ఆ ఒక్క రోజే కాదు - వారం రోజుల వరకు ఏ నోట విందామన్నా ఇదే మాట.

ఆ సాయం కాలానికే నౌకర్లందరికీ ఆ ఇంటితో అనుబంధం తెగిపోయింది. అది ఒక నాటిది కాదు. ఎంతో కాలంగా ఉన్న బంధం. అది ఉన్నట్లుండి ఇట్లా తెగిపోతుందని కలలో కూడా ఊహించలేదు. ఊహించని పరిణామం అతి సామాన్యంగా జరిగిపోతుంటే వాళ్లు దానిని జీర్ణించుకోవడం కాదు. తట్టుకోలేకపోతున్నారు. అయినా ఆ ఇంటికి కన్నీటి వీడ్కోలు చెప్పకతప్పలేదు.

తాను తన భార్య తన నౌకర్లు మాత్రమే ఆ సాయంకాలానికి మిగలాలని అతని కోరికజ ఆ కోరికకు తగిన ఏర్పాట్లు చేసుకొన్నాడు.

అప్పుడు అతని ఊహలు రెక్కలు విప్పుకొన్నాయి.

ఆ ఊహల్లో ముఖ్యంగా శోభనం గది చోటు చేసుకొనింది. ఆ గది అలంకరణలో అతని మనసు లగ్నమయింది. అంగవైకల్యమో ఏదైనా ఒక లోపమో ఉంటే మనిషి తెలివి తేటలు అద్భుతంగా ఉంటాయట. వాళ్లు అనతి మనస్సును చదివేసినట్లుగా చేస్తున్న హడావిడి చూడముచ్చటగా ఉంది. కనుసన్నల్లో మెదులుతూ పోటీలుపడి పని చేస్తున్నారు. శోభనం గదిలో హంసతూలికా తల్పం విరిసిన మల్లెల అలకంరణతో బరువెక్కింది. ఆ మల్లెల సౌరభంతో కలగలిసిన విదేశీ సెంట్ల వాసనలు గుబాళిస్తున్నాయి. అర్ధనగ్న చిత్రాలు అమాంతంగా ప్రాణం పోసుకొని కాలికి గజ్జెకట్టుతున్నట్లున్నాయి. టేబులు మీద పెట్టిన రకరకాల పండ్లూ పదార్థాలు నోరూరిస్తున్నాయి.

ఆ గదిలో నిలబడి ఆ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అతని మనస్సు సగం జాలితో...సగం ఆనందంతో.... ఆలోచనలు ఒక చోట మొదలై ఇంకొకచోట తెగిపోతూ... వ్యక్తం చేసుకోలేని ఒక విచిత్రమైన స్థితిలో.... గుండె శబ్దం గడియారంలో సెకండ్ల శబ్దంగా... సెకండ్లు నిముషాలై... నిముషాలు గంటలై... అతని మనస్సు కాలంలో పోటీ పడుతూ.

గంట తొమ్మిదయింది.

అసలే అందగత్తె. బంగారుకు తాని అద్దినట్లు అలకంరణ. దివి నుండి దిగి వచ్చిన దేవకాంతలా తెలిగిపోతూ ఉంది. ఎంత అలంకరించినా పాపం! ఆమెకేం తెలుసు? రాతికి చక్కలిగిల్లి పెట్టినట్లేకదా? అదీగాక ఆ అలంకరణ అంతా శోభనం గదిలోకి. అక్కడ దాని అవసరం లేకపోయినా అది పద్ధతి. అలంకరణ పూర్తయింది మూగచెవిటి ముచ్చటగా, అద్దం ముందు నిలబెట్టారు. సంతృప్తిగా నిట్టూర్చారు. ఆ తర్వాత ఆమెను నడిపించారు. ఆమె నడిచింది అడుగు మీద అడుగ్గా....హంసకే నడకలు నేర్పినట్లుగా శోభనం గదిలో హంసతూలికా తప్పం మీద కూర్చోబెట్టారు.

తనను అలంకరించడానికి వాళ్లు చూపుతున్న శ్రద్ధ ఆమె గ్రహిస్తూనే ఉంది. శోభనం గదిలోకి పంపడానికి వాళ్లు పడుతున్న హడావిడి తెలుస్తూనే ఉంది. అందరూ తన నౌకర్లే. అది వాళ్ల కర్తవ్యం. అయినా ఒక మనిషిగా వాళ్లను అభినందించాలని ఆమె ఆరాటం. మాటల్లో చెప్తే కొందిరికి వినిపించదు. కొంధరికి అర్థం కాదు. చూపుల్లో వ్యక్తం చేస్తామంటే తనకా అదృష్టం లేదు.

ఆమె గుండెల్లో నుండి భారంగా వెలువడిన నిట్టూర్పు ఆ గదిని చుట్టేసిన సువాసనలతో కలిసిపోయింది!

ఆ తరువాత వాళ్లు తలుపు మూసుకొనిపోయారు. ఆమెకు అది తెలుస్తూనే ఉంది. మరికొన్ని నిముషాలలో తలుపు తెరుచుకొన్నది. అదీ తెలుస్తూనే ఉంది. మరలా ఆ తనువు మూతపడింది. అది కూడా తెలుస్తూనే ఉంది.

ఆమె పెదవుల మీద విరిసిన పారిజాతాలు...బుగ్గల్లో సిగ్గు దొంతరలు!....

అయినా ఆమె గుండెల్లో దడ!

నిభాయించుకొని మెల్లగా లేచి నిలబడింది.

అతడామెను సమీపించాడు. కెంపులు పూస్తున్న చెంపలను రెండు అర చేతుల్లోకి తీసుకొన్నాడు. వెచ్చని...నెలివెచ్చని అరచేతుల్లో నుండి మెల్లగా మెల మెల్లగా జారుతూ జారుతూ ఆమె అతని పాదాల మీద వాలిపోయింది.

ఆ పాదాలను కన్నీటి ముత్యాలు కడుగుతున్నాయి.

అతడు వంటి ఆమె రెండు భుజాలను పట్టుకొని మెల్లగా పైకిలేపాడు.

ఆమె అతన్ని అల్లుకొనిపోయింది ఒక తీగలా. ఆమెను అట్లానే పొదివి పట్టుకొని అలవోకగా చేతుల్లోకి ఎత్తుకొని పట్టె మంచం మీద పడుకోబెట్టాడు.

ఆ తర్వాత కలిసిన మనసుల కార్యకలాపాలకు పట్టె మంచమే పరవశించింది.


****

అంతవరకు ఆ గదిలో ఘనీభవించిన కాలానికి చలనం వచ్చింది. అతడు మొలకు లుంగీ చుట్టుకొంటూ పైకి లేచాడు. లైట్ వేశాడు. తృప్తిగా ఆమె వైపు చూశాడు. పడకమీద అస్తవ్యస్థంగా...ఆలసి సొలసి గాఢ నిద్రలో - ఆమె నలిగినపువ్వులా ఉంది. అయినా పొందిన అనుభూతికి సాక్ష్యాలుగా పెదవుల మీద చిరునవ్వులు తారట్లాడుతున్నాయి. కించిత్ గర్వంతో విప్పారిన ఎద మీద మగతనం. రెండు చేతులతో ఉంగరాల జుట్టును సవరించుకొంటూ అద్దం ముందుకు నడిచాడు. ఒకసారి తన రూపాన్ని అద్దంలో చూసుకొన్నాడు.

అతని మొగం నల్లటడింది.

ఒళ్ళంతా గొంగళి పురుగులు పారాడుతున్నట్టు!

గబగబ లైట్ ఆర్పివేశాడు. నైట్‌గౌన్ తొడుకున్నాడు. కుర్చీల కుప్పగా కూలిపోయాడు. తకు తనకే అసహ్యం కలిగిస్తున్న ఈ వ్యాధి తనకెందుకొచ్చింది. వచ్చింది వొళ్ళంతా వ్యాపించి ఉండినా ఏ బాధా ఉండేది కాదు. ఎందుకో ముఖాన్ని మాత్రం దయతలచి విడిచిపెట్టింది. ఈ బ



లహీనతను కప్పిపుచ్చుకోవడానికి త్యాగం పేరుతో తానెంత నాటకం ఆడాడు?

అతని తల వాలిపోయింది.

మనసు పూచిన మోదుగలా పచ్చి పుండయి గతానికి దారితీసింది!

****

దాదాపు మూడు దశాబ్దాలకు మునుపు. ఎవో కథల్లో చెప్పినట్టు కాకులు దూరని కారడవులు....చీమలు దూరని చిట్టడవులకవతల ఒక పల్లె. ఆ పల్లెను వెదుక్కొంటూ వచ్చింది కలరా. రావడంరావడం తన ఇంటి మీదికే దాడి చేసింది. ఒకే దినంలో అమ్మను అయ్యను పొట్టను పెట్టుకొనింది. ఊళ్ళో జనం పుట్టకొకరు చెట్టుకొకరుగా వలసపోతే ఊరు ఖాళీ అయి పోయింది. ప్రాణం మీద తీపితో కన్నవాళ్ళు కంటిముందు శవాలై పడుంటే గుండె రాయి చేసుకొని ఊరు వదిలాడు. సమీపంలో ఉన్న ఒక పట్టణాన్ని చేరుకొన్నాడు. పగలంతా కూలి చేసుకోవడం. రాత్రిపూట మఠం తిన్నె మీద నిద్రపోవడం!

ఆ మఠం తిన్నె భారతదేశాకిని ఒక చక్కని నమూనా. విశాలమైన ఆ తిన్నెల మీద కూలీలు బిచ్చగాళ్లు జోగులు యోగులు బైరాగులు విరాగులు సాధువులు సన్యాసులు సహజీవనం చేస్తుంటారు. చిలుం బీడీ సిగరెట్టు పొగలు కలగలసి మత్తెక్కిస్తుంటాయి. ఆ మత్తులో చర్చకు రాని అంశమంటూ ఉండదు. ఎవడికి తోచింది వాడు ఎది నోటికొస్తే అది. వాగేది. వాదులాడుకొనేది. ఆ వాదులాటలు రంపులు రచ్చల వరకు పెరిగేవి. ఆ స్థితిలో ఏ సాధువో సన్యాసో జోక్యం కల్పించుకొంటాడు. హితవు చెప్తాడు. అదిగూడా శ్రద్ధగా వింటారు. అప్పటికప్పుడే జ్ఞానోదయం కలిగి జీవిత పరమార్థం తెలుసుకొన్న వాళ్లవలె ఎక్కడి వాళ్లక్కడ పడి నిద్రపోతారు.

ఆ సహ జీవనంలో తానూ ఒక సభ్యుడయ్యాడు.ఒకానొక రాత్రి. ఆ తిన్నె మీద ఒక ముసలి బైరాగి చావు బ్రతుకులతో పోరాడుతున్నాడు. అట్లాంటి చావులు ఆ తిన్నెకేమీ కొత్తకావు. వాళ్లకు తెలియనవి కావు. ఎప్పుడో ఒకప్పుడు తీరిపోతే పోతాడు. ఎవరో వొకరు వచ్చి మట్టికి మరుగుచేస్తారు. ఇంతవరకు జరిగిందీ అదే. ఇప్పుడు జరగబోయేది అదే. ఆ అభిప్రాయంతోనే ఎవడి లోకంలో వాళ్లున్నారు. అయితే పాపం! ఆ భైరాగికీ ఒక కొడుకు ఉండేవాడు. అచ్చం అంతా వీడి పోలికే. 'బాబా! బాబా!' అంటూ వెంటపడి తిరుగుతూ ఉండేవాడు. ఉంటే ఇప్పటికి ఇంచుమించు వీడి వయస్సే ఉండేది." అన్నాడు ఒక సాధువు తనను చూపిస్తూ.

ఆ మాట ఎవరు విన్నారో ఎవరు వినలేదో తనకు తెలియదు. అందరూ నిద్రపోతున్నా తనకు మాత్రం నిద్రపట్ట లేదు. 'అచ్చం అంతా వీడి పోలికే!' అన్న మాట మనస్సును తొలుస్తూ ఉంది. నడిరేయి. గుర్‌గర్‌మన్న గురకలు. చలనరహితంగా అందరూ శవాల్లా. ఆ బైరాగి మూలుగు మాత్రం ఎక్కడో నూతిలో నుండి వినిపిస్తున్నట్లుంది. తాను అడుగుమీద అడుగ్గా బైరాగి వద్దకు నడిచాడు. ప్రక్కన కూర్చున్నాడు. తలవంచి చెవి దగ్గర 'బాబా! బాబా!' అన్నాడు. ఆ మాట చెవుల్లో పడేసరికి ఆ కట్టెలోకి ఎట్లా వచ్చిందో అంత చైతన్యం? - రెండు చేతులతో తన వొళ్లంతా నిమిరాడు. తలను మెల్లగా నోటి దగ్గరకు తీసుకొని చెవులో గుసగుసచెప్పాడు!

ఆ మరుసటి క్షణమే గురుడు గుటెక్కిపోయాడు.

తెల్లవారింది.

ఎవరి దారి వాళ్లదయింది.

తన దారి మరొక పట్టణానికి దారి తీసింది.

ఎదురుచూడని విధంగా అదృష్టం తనను వరించింది.

నిజమే! అయితే దానిని అనుభవించే దారి? అదే ఎంత ఆలోచించినా తన చిన్న బుర్రకు అందలేదు. ఏ మాత్రం బయటికి పొక్కినా తన ప్రాణాలకే ముప్పు తప్పదని తెలుసు. అందుకే అదృష్టం వరించిందన్న ఆనందం కంటే భయమే ఎక్కువగా పట్టిపీడిస్తూ ఉంది. ఒక చిన్న పాత్రలో దొరికిన ఆభరణాలను పాతగుడ్డలో మూటగట్టి అంతకంటే పాత సంచిలో వేసుకొని ఎవ్వరికీ ఏ మాత్రం అనుమానం కలగకుండా దినగండం నూరేండ్లాయస్సుగా తిరుగుతున్నాడు.

అట్లా తిరుగుతూ తిరుగుతూ ఒకరోజు ఒక బడి ముందు నిలబడ్డాడు. ఆ బడిలో ఎంతోమంది పిల్లలు. తనకంటే పెద్దవాళ్లు. చిన్నవాళ్లు. తన ఈడు వాళ్లు. బరువు బాధ్యతలకు అతీతంగా....ఆనందంగా తనకా అదృష్టం లేకుండా పోయిందే అని ఆలోచించుకొంటూ ఉంటే ఆ దారిన పోతూ ఒక ఉపాధ్యాయుడు. ఆ బడి బయట గుమిగూడిన నలుగురైదుగురు పిల్లలు. అతనిని చూపిస్తూ అతడు పాఠం చెప్పే తీరును పిల్లలను తన బిడ్డలుగా ప్రేమించే గుణాన్ని....అంతకు మించిన మంచి తనాన్ని తెగ మెచ్చుకొంటున్నారు.

ఆ మహానుభావుడే తన జీవితాన్ని ఒక మలుపు తిప్పిన దేవుడు!

మానవత్వం ఇంకా జీవించి ఉందన్న నమ్మకాన్ని కలిగించిన మహామనీషి!!

తాను నోరుండీ ఒక మూగది. చెవులుండీ ఒక చెవిటిది. దినమంతా ఆ మౌనాన్ని భరించడం ఒక శిక్ష. ఒక శాపం. ఆమె మనసు విలవిలలాడేది. అయినా మనసు విప్పి చెప్పుకోవడానికి ఎవరున్నారు?

ఆయన వెంటపడడం...కాళ్ళా వేళ్లాపడి బ్రతిమాలడం...పని పిల్లవాడుగా తనకాయింట్లో ఆశ్రయం దొరకడం...నెలలు తిరగకముందే తాను అందరికీ తలలో నాలుక కావడం...అప్పుడు తన పరిస్థితిని ఆయనకు వివరించడం...ఆ నగలు బ్యాంకులో నగదు రూపంలో డిపాజిట్ కావడం.... తీరిక వేళల్లో చదువు చెప్పి తనను తీర్చి దిద్దడం... ఆ తర్వాత ప్రారంభించిన వ్యాపారం కలిసిరావడం..., ఫ్యాక్టరీ స్థాపించే స్థాయికి ఎదగడం అంతా ఊహించని రీతిగా జరిగిపోయింది.

అయితే ఊహించని విధంగానే తనకీ కర్మరోగం కూడా సంక్రమించింది.

దానిని కప్పిపుచ్చుకోవడానికి ఇంత కపట నాటకం?

ఆ గదిలో ఆవరించిన చీకటి తన మనస్సులా ఉంది. ఒకరి గుండె చప్పుడు మరొకరికి వినిపించేంత నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని ఒక చిన్న శబ్దం. అతని దృష్టి అటు మరలింది. పట్టె మంచం మీద కదలిక. ఆమె మరొక వైపుకు వొత్తిగిలి పడుకొనింది.

అతని ఆలోచనా స్రవంతి తెగిపోయింది!

****

ఆ అందాల మేడ ఒక చిన్న చిత్రమైన ప్రపంచం!

ఆ ప్రపంచంలో త్యాగం అన్న ముసుగులో ఆమె పంజరంలో చిలుక. అడగడం ఆదేశించడం ఎదురు చూడడం వంటి అవసరాలలో నిమిత్తమే లేకుండా ఆమె అవసరాలన్నీ తలతో నడిచి కాళ్లవద్దకు వస్తున్నాయి. అది రాణివాసమైతే ఆమె అనుభవిస్తున్నది రాజభోగాలు! - రాణులైనా పరిచారకులను పిలవాలి. ఆమెకా అవసరమే లేదు. ఎప్పుడు ఏ అవసరం కలుగుతుందో అని ఎదురు చూస్తూ వెన్నంటి మనుషులు!

అయితే ఆ మౌన సామ్రాజ్యంలో పగలు గడవడమే ఒక గగనంగా ఉంది.

ఉదయంతో పోటీ పడుతూ అతని కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఒక్క వ్యాపారం కాదు. ఒక్క ఫ్యాక్టరీ కాదు. ఊపిరి సలుపుకోలేనన్ని వ్యాపకాలు. వాటిలో తలమునకలవుతూ రాత్రి తొమ్మిది పది గంటల వరకు. ఆ సమయంలో తాను నోరుండీ ఒక మూగది. చెవులుండీ ఒక చెవిటిది. దినమంతా ఆ మౌనాన్ని భరించడం ఒక శిక్ష. ఒక శాపం. ఆమె మనసు విలవిలలాడేది. అయినా మనసు విప్పి చెప్పుకోవడానికి ఎవరున్నారు? ఇంటినిండా మూగా చెవిటి. వాళ్ల ముచ్చట చూడడానికి తాను నోచుకోలేదు.

అయితే ఆయన రాత్రి ఏ పది గంటలకో వస్తూనే ఉదయాన్నుండి పడిన యాతనంతా సూర్యకిరణం ముందు మంచు బిందువులా కరిగిపోతుంది. అతని బాహువుల్లో వొదిగి ఎదమీద వొరిగి రెక్కలు గట్టుకొని ఎగిరిపోతుంది ఎక్కడెక్కడికో! బృందావన సీమలకు...ఆనందానుభూతులను పంచుకొంటూ...అనురాగ సరాగాల మాలలు అల్లుకొంటూ...అక్కడే!...అక్కడే!...తిరిగి రాకుండా శాశ్వతంగా ఉండిపోవాలని తన ఆరాటం!...కానీ....ఆయనది జీవన పోరాటం!... ఈ ఆరాట పోరాటాల్లో ఆ మౌన సామ్రాజ్యంలో తాను రెక్కలు తెగిన పక్షి.

అనుభవానికి రానంత వరకే కష్టానికి కానీ సుఖానికి కానీ విలువ.

అనుభవానికొస్తే అదొక అలవాటు!

అలవాటయితే దేనినైనా భరించడం పెద్ద కష్టం కాదు.

ఈ జీవితం ఆమెకు అలవాటయిపోయింది.

అలవాటయిన జీవితం అతి సాఫీగా సాగిపోతూ ఉంది.

ఆమె గర్భవతి అయింది!

ఆ మాట చెవుల్లో పడినప్పుడు అతడు ఒక్క క్షణంచలించి పోయాడు!

ఒక నిట్టూర్పులా...ఒక మౌన భాష్పకణంలా తన బ్రతుకే అర్థరహితంగా నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆమె కనిపించింది. తనకు తోడయింది. తన ఆంతరంగిక జీవిత యాత్రలో...ఐహిక జీవన మధుపాత్రలో అనురాగ మధువును నింపింది. అడుగడుగున ఆమని పంచింది. భవిష్యత్తు మీద ఆశలు పెంచింది. తన జీవితానికి అర్థాన్ని పరమార్థాన్ని తెలియ చెప్పింది.

ఆ క్షణంలో తన జీవితమే పరిపూర్ణతను సంతరించుకొన్నట్లు...తాను సాధించింది సంపాదించింది అంతా సార్థకమైనట్లు....తనంతటి అదృష్టవంతుడు మరొకడు లేనట్లు తోచింది.

అతని మనస్సు పూచిన పందిరే అయింది!

సుడిగాలిలా దూసుకొనిపోయి ఆమెను చుట్టేశాడు!!

ఆ రోజు నుండి ఆమె మీద శ్రద్ధ మరీ ఎక్కువయిపోయింది. లేచినా కూర్చున్నా అడుగు తీసి అడుగుపెట్టాలన్నా అంతా నౌకర్ల ప్రమేయంతోనే. ఆ అతిని భరించడం ఆమె వల్ల కాలేదు. అప్పుడప్పుడు విసుగు కలుగుతుంది. అయినా ఏం చేస్తుంది? - ఆ వాతావరణంలో ని

జంగా తానొక నిస్సహాయ!

నెలలు గడిచాయి.

సీమంతపు వేడకలు!...నింగినేలా ఏకమయ్యాయి.

నెలలు నిండాయి. నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆమెను ఒక ఆస్పత్రికి తరలించారు. అది ఆమెకు తెలుస్తూనే ఉంది. ప్రసవవేదన అదొక యాతన. తప్పలేదు. సుఖ ప్రసవమే!

"బాబు పుట్టాడండీ!"

నర్సులు ఆయనతో చెప్పిన ఆ ఒక్క మాట మాత్రమే తన చెవిన పడింది. ఆ తరువాత పిలిచినా ఎవ్వరూ పలకడం లేదు. వైద్య సదుపాయాలు మాత్రం ఏ లోటు రాకుండా జరిగిపోతున్నాయి. కొంపదీసి ఈ ఆస్పత్రిలో కూడా మూగ చెవిటి వాళ్లేనేమో అన్న అనుమానం కలుగుతూ ఉంది. తన బిడ్డ ఎట్లా ఉన్నాడో తెలుసుకోవాలన్నదే తాపత్రయం. అయినా ఎవరిని అడగం? ఆమె మనసు విలవిలలాడిపోతూ ఉంది!

శరీరంలో శక్తినంతా ఎవరో అపహరించుకపోయినట్లు నిస్సత్తువ. కాలూ చెయ్యి కదిలించడం కూడా కష్టంగా ఉంది. తన మనస్సు నిండా మాత్రం తన బిడ్డ ఊహా రూపమే. ఆ రూపం స్పష్టాస్పష్టాల మధ్య!



ఒక రోజు గడిచింది. రెండో రోజు గడిచింది. మూడో నాటికి కొంత ఓపిక కూడగట్టుకొనింది. అప్పుడు ఆ బిడ్డ వొళ్లంతా తడిమి తడిమి చూసింది. కండ్లూ చెవులు ముక్కూ ఒక్కొక్క అవయవంగా తడిమిచూస్తూ వొళ్లంతా తడిమింది. నును లేత ఆకు వంటి చర్మం! ఆ స్పర్శ తన జ్ఞాన నేత్రానికే పరీక్ష పెట్టింది.

అంధత్వం తనకొక శాపంగా పరిణమించింది. ఆ శాపమే ఒక వరమై భోగభాగ్యాలను సమకూర్చింది. అయినా తన బిడ్డ ఎట్లా ఉన్నాడో తెలుసుకోలేని దురదృష్టవంతురాలు తాను! తనకంటే నోరులేని గొడ్డు మేలు కదా? దూడను ఈనుతుంద్తీ ఒళ్లంతా కండ్లు చేసి చూస్తూ తనివిదీరా నాకుతుందట!

పోనీ!....అయన్నే అడుగుదామనుకొంటే ఆయన ఆనందంలో ఆయన!

పలకరింపే కరువుగా అప్పటినుండే నామకరణోత్సవ ఏర్పాట్లల్లోపడి.

ఆ రోజు కూడా రానే వచ్చింది. తన బిడ్డ ముక్కూమూతి ఎట్లా ఉందో? ఏ రంగులో ఉన్నాడో? ఎవరి పోలికో? తన తాపత్రయంలో తానుంటే నామకరణోత్సవం జరిగిపోయింది మళ్లీ పెండ్లి నాటిని తలపింపచేస్తూ!

ఈ మనస్సులు గుడ్డివి.

ఆ రాత్రి...ఆ మేడలో... శోభాయమానంగా వెలిగిపోతున్న హాలులో...పూల పడవలా అలంకరించిన బంగారు ఉయ్యాలలో....వంశోద్ధారకుడు చిరునవ్వులు చిందిస్తూ. ఆ ఉయ్యాల ప్రక్కన అతడు ఆమె. అతని మనస్సులో కట్టలు తెంచుకొన్న ఆనందం పొంగి కన్నుల్లో వెలుగులై చిన్నారి చిరునవ్వులతో పోటీపడుతున్నాయి. అతడు మెల్లగా ఉయ్యాల ఊపుతున్నాడు. ఆమె నిగ్రహం క్షణ క్షణానికి సహనాన్ని కోల్పోతూ ఉంది.

"ఏమండీ?"

"ఏం కావాలో చెప్పు?" అన్నట్లుగా అతడు ఆమె చుబుకాన్ని స్పృశిస్తూ తనవైపుకు తిప్పుకొన్నాడు.

"బాబూ ఎట్లా ఉన్నాడండీ?"

"ఎంత అందంగా ఉన్నాడో?... నేనే కవినైతే?..."

"ఎవరి పోలికండీ?"

"అంతా నీ పోలికే!" తల్లి పోలిక కొడుకు అదృష్టవంతుడంటారు"

"అయితే మీ వొంటి మీదున్న మచ్చలు వాడికి రాలేదు కదండీ?"

తన పాదాల క్రింద భూమి కదులుతున్నట్లు...రెండుగా చీలుతున్నట్లు...అందులో తాను కూరుకపోతున్నట్లు...పెండ్లి నాటి ఉపన్యాసాలు కుబుసం విడిచిన పాములై కరుస్తున్నట్లు...బలవంతంగా ఇంటి నుండి తొలిగించిన నౌకర్లు విరగబడి నవ్వుతూ అవహేళన చేస్తున్నట్లు... తాను చేసిన మోసం ఆమెలో ద్వేషాగ్నిని రగిలిస్తున్నట్లు - సన్నగా వణుకు ప్రారంభమయింది. గొంతు తడారిపోయింది. నాలుక పిడచ గట్టింది. ఎంత ప్రయత్నించినా మాట పెగలనంటూ ఉంది. అతని తల వాలిపోయింది.


"ఏమండీ! కన్నులు!...అందానికే అంకితమైన కన్నులు మోసం చేస్తాయి. మనస్సు చేయదు. ఏ ఆడదైనా మగవాణ్ణి మనస్సుతో చూస్తుందికానీ కంటితో కాదండీ!"

చెంప మీద ఛెళ్ళున పడినట్లయింది దెబ్బ!

అతడు తలపైకెత్తి చూశాడు.


ఆమె మొగం వెలిగిపోతూ ఉంది - హాల్లో విద్యుత్కాంతులతో పోటీపడ్తూ.

**"నిజమే! ఏ స్త్రీ అయినా కంటితో చూస్తే తన పురుషుడితో కాపురం చేయడం కష్టమే!" అతని మనస్సులో పుట్టిన భావం గొంతు దాటలేక గుండెలను పిండితే - అతడు తలవంచాడు!**



## బహు భాషా ప్రవీణుడు

**చా**లామంది ఒక భాషతోనే కుస్తీలు పడుతుంటారు. జార్జెస్ హెన్రీ మాత్రం 31 భాషలలోనూ అనర్గళంగామాట్లాడటం నేర్చేసుకున్నాడు. అమెరికాలోని టెర్మినాలజీ విభాగంలో చీఫ్‌గా పనిచేసిన ఈయన1965-71 ప్రాంతాల్లో 31 భాషల్లో గడగడా మాట్లాడేస్తూ చరిత్ర సృష్టించాడు




**ప్ర**పంచంలో అతిపొడవైన జడగల అమ్మాయి పేరు జార్జియా సబ్రాంత్కె. పశ్చిమ జర్మనీ దేశస్తురాలైన ఈ అమ్మాయి జడ పొడవు 9 అడుగుల ఎనిమిదన్నర అంగుళాలు. ఈ